క్లుప్తంగా

వలంటీర్ల రాజీనామా



నందిగామ: మండలంలోని పలు గ్రామాలకు చెందిన 12 మంది వలంటీర్లు గురువారం రాజీనామాలు చేశారు. వారి రాజీనామా పత్రాలను ఎంపీడీవో ఎం విశ్వనాథ్‌కు అందజేశారు. మండలంలోని అడవిరావులపాడు గ్రామానికి చెందిన ఒక వలంటీర్, నందిగామ మండలం జగ్గయ్యపేట నియోజకవర్గ పరిధిలోని కొండూరు గ్రామానికి చెందిన 11 మంది వలంటీర్లు రాజీనామాలు చేశారు. అనంతరం పలువురు వలంటీర్లు మాట్లాడుతూ ప్రతిపక్షాలు వలంటీర్లపై చేస్తున్న విమర్శలు విని తట్టుకోలేక రాజీనామాలు చేస్తున్నట్లు తెలిపారు. తాము సేవ చేస్తే చూస్తూ తట్టుకోలేక విమర్శించడం బాధాకరమన్నారు.

40 మంది వలంటీర్ల రాజీనామా



వీరులపాడు: మండలంలోని అల్లూరు, జయంతి గ్రామాలకు చెందిన 40 మంది వలంటీర్లు రాజీనామా చేసినట్లు ఎంపీడీవో శివపార్వతి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అల్లూరు నుంచి 20, జయంతి నుంచి 20 మంది వలంటీర్లు గురువారం రాజీనామా పత్రాలు అందజేశారన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వలంటీర్ల రాజీనామాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. పలువురు వలంటీర్లు మాట్లాడుతూ ఎన్నికలను అడ్డంపెట్టుకుని చంద్రబాబు నిమ్మగడ్డ రమేష్‌తో ఫిర్యాదు చేయించి తమను విధుల నుంచి తొలగించటం దుర్మార్గ చర్యన్నారు. రానున్న ఎన్నికలలో వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేస్తామని చెప్పారు.

గోశాలకు వరి గడ్డి వితరణ



పెనుగంచిప్రోలు: స్థానిక శ్రీతిరుపతమ్మవారి గోశాలలో గోవుల కోసం గురువారం తెలంగాణ రాష్ట్రం, సూర్యాపేట జిల్లా గొండ్రియాల గ్రామానికి చెందిన రైతు బండ్ల వెంకటయ్య రూ.13 వేల విలువైన వరి గడ్డిని అందజేశారు. తన సొంత ఖర్చులతో ట్రాక్టర్‌పై గడ్డిని తెచ్చి ఉచితంగా అందజేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు. దాతకు ఆలయ సిబ్బంది అమ్మవారి ప్రసాదాలు అందజేశారు. మండలంలోని సుబ్బాయిగూడెం గ్రామానికి చెందిన వెల్ది ప్రభాకరరావు రూ.6,500 విలువ చేసే వరి గడ్డిని సొంత ఖర్చులతో ట్రాక్టర్‌పై తీసుకొచ్చి ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో కె.రమేష్‌నాయుడు మాట్లాడుతూ ఎవరైనా దాతలు ఉంటే గోవుల కోసం వరి గడ్డి అందజేయాలన్నారు.

ఘనంగా సీతారాముల పట్టాభిషేకం



నందిగామ: పట్టణంలోని సీతారామాంజనేయ స్వామి వారి ఆలయంలో శ్రీరామనవమి సందర్భంగా నిర్వహిస్తున్న వేడుకలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ వేడుకలలో భాగంగా గురువారం ఆలయంలోని స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితుల మంత్రాల నడుమ సీతారాముల పట్టాభిషేక కార్యక్రమం వైభవంగా జరిగింది. సాయంత్రం సమయంలో సహస్ర దీపోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఆయా కార్యక్రమాలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎన్నికల సమయంలో వివాదాలకు పోవద్దు



చందర్లపాడు(నందిగామ): ఎన్నికల సమయంలో అనవసరంగా వివాదాలకు పోయి ఇబ్బందులు పడవద్దని నందిగామ రూరల్ సీఐ పి.చంద్రశేఖర్ సూచించారు. చందర్లపాడు మండలం చింతలపాడు గ్రామంలో గురువారం రాత్రి ప్రత్యేక పోలీసు కవాతు నిర్వహించి, అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రూరల్ సీఐ చంద్రశేఖర్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అన్ని పార్టీల నాయకులు సహకరించాలన్నారు. ముఖ్యంగా ఎన్నికల సమయంలో వివాదాలు జరిగితే ఆ తరువాత ఎదుర్కొనే ఇబ్బందుల గురించి గ్రామస్తులకు వివరించారు. నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకునేందుకే అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చందర్లపాడు ఎస్ఐ ఆర్ ధర్మరాజు, పలువులు సిబ్బంది పాల్గొన్నారు.

రైతుకు దక్కిన భరోసా

- రైతన్నల చెంతకే రైతు భరోసా కేంద్రాలు
- సబ్సిడీపై నాణ్యమైన విత్తనాలు, ఎరువులు
- నాడు టీడీపీ పాలనలో వంచన..
- నేడు జగనన్న పాలనలో భరోసా
- నియోజకవర్గంలో రూ.187.83 కోట్లు పెట్టుబడి సాయం



శివాపురం రైతు భరోసా కేంద్రం

పెనుగంచిప్రోలు: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యం కల్పించింది. విత్తనం వేసి పంట చేతి కొచ్చి అమ్ముకునే వరకు రైతులకు అన్ని విధాలా అండగా ఉండేందుకు రైతు భరోసా కేంద్రాలు (ఆర్బీకే)లను అమల్లోకి తెచ్చింది. గత చంద్రబాబు ప్రభుత్వం వంచనతో వ్యవసాయం దండగగా మారగా.. జగనన్న ప్రభుత్వంలో వ్యవసాయం పండుగలా మారింది. రైతు భరోసా సంక్షేమ పథకం ద్వారా పెట్టుబడి సాయం అందించారు.

నియోజకవర్గంలో రైతులకు రూ.187.83 కోట్లు

జగ్గయ్యపేట నియోజకవర్గంలో మొత్తం 56 రైతు భరోసా కేంద్రాలు ఉండగా 2019–20 నుంచి 2023–24 వరకు ఐదేళ్లలో జగ్గయ్యపేట మండలంలో 9,355 మంది రైతులకు రూ.56.58 కోట్లు, పెనుగంచిప్రోలు మండలంలో 8,202 మంది రైతులకు రూ.50.11 కోట్లు, వత్సవాయి మండలంలో 9,487 మంది రైతులకు రూ.59.14 కోట్లు, నియోజకవర్గంలోని నందిగామ మండలంలో 3,402 మంది రైతులకు 21.98 కోట్లు మొత్తం 30,446 మంది రైతులకు రూ.187.83 కోట్లు పెట్టుబడి సాయం అందింది.

రైతులకు ఉచిత బీమా..

టీడీపీ ప్రభుత్వం హయాంలో బీమా మొత్తానికి 2 నుంచి 5 శాతం ప్రీమియం చెల్లిస్తేనే బీమా వర్తించేది. అదికూడా వేలాది రూపాయిల ప్రీమియం చెల్లించినప్పటికీ నష్ట పరిహారం మాత్రం తూతూ మంత్రంగా వచ్చేది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతులకు ఉచిత పంటల బీమా సదుపాయం కల్పించింది. 2021–22లో మిర్చి నష్టపోయిన రైతులకు ఎకరానికి గరిష్ఠంగా రూ.47 వేల వరకు నష్ట పరిహారం అందించటం చరిత్రగా మిగిలింది. 2020–21లో నియోజకవర్గంలో పంట నష్టపోయిన రైతులకు జగ్గయ్యపేట మండలంలో 2,429.67 ఎకరాలకు గాను 1,228 మంది రైతులకు రూ.313.99 లక్షలు, పెనుగంచిప్రోలు మండలంలో 534.43 ఎకరాలకు 387 మంది రైతులకు రూ.25.6 లక్షలు, వత్సవాయి మండలంలో 5,218.69 ఎకరాలకు 2,625 మంది రైతులకు రూ.596.01 లక్షలు, నందిగామ మండలంలో 2485.81 ఎకరాలకు 1,304 మంది రైతులకు రూ.307.56 లక్షలు నష్టపరిహాం అందించారు. 2021–22లో పెట్టుబడి ఎక్కువగా ఉండే మిర్చి నష్టపోతే స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి రైతులకు అధిక నష్టపరిహారం ఇప్పించారు. 2021–22లో జగ్గయ్యపేట మండలంలో 2130.85 ఎకరాలకు 1,297 మంది రైతులకు రూ.1,021.4 లక్షలు, పెనుగంచిప్రోలు మండలంలో 5,536.22 ఎకరాలకు 2,487 మంది రైతులకు రూ.2,534.9 లక్షలు, వత్సవాయి మండలంలో 5,338.67 ఎకరాలకు 2605 మంది రైతులకు 2,566.65 లక్షలు, నందిగామ మండలంలో 4,882.71 ఎకరాలకు 951 మంది రైతులకు 267.28 లక్షల నష్ట పరిహారం అందింది.

విత్తనాలు, పురుగు మందుల పంపిణీ...

నియోజకవర్గంలోని ఆర్బీకేల ద్వారా రైతులకు 1,356 క్వింటాళ్ల విత్తనాలు, 2,305 మెట్రిక్ టన్నుల ఎరువులు అందించారు. అలాగే 4,448 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించారు.

యంత్రాలు, యంత్ర పరికరాలు..

వైఎస్సార్ యంత్ర సేవా పథకం కింద 56 సీహెచ్‌సీ (రైతు గ్రూపులు) ల ద్వారా రూ.141.45 లక్షల సబ్సిడీ ద్వారా 404 వ్యవసాయ పనిముట్లు, రూ.89.28 లక్షల సబ్సిడీపై 37ట్రాక్టర్లు, రూ.96.80లక్షల సబ్సిడీ ద్వారా 10 హార్వెస్టర్లు అందించారు. మిచాంగ్ తుఫాన్‌కు సంబంధించి జగ్గయ్యపేట మండలంలో 56మంది రైతులకు 36 ఎకరాలకు గాను రూ.2.49 లక్షలు, వత్సవాయి మండలంలో 142 మంది రైతులకు 123 ఎకరాలకు గాను రూ.8,34 లక్షలు, పెనుగంచిప్రోలు మండలంలో 927మంది రైతులకు 1,078 ఎకరాలకు రూ.73.32 లక్షలు మంజూరయ్యాయి. నియోజకవర్గంలో మొత్తం 7,908మంది సీసీఆర్‌సీకార్డులు అందించారు.

పెట్టుబడికి భరోసా..



వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. గతంలో ఏ ప్రభుత్వమూ కూడా రైతు గురించి ఆలోచించలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాకే రైతులకు ఎంతో మేలు జరుగుతోంది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి ఏడాది పంటల సాగు కింద రైతు భరోసా అందిస్తున్నారు. దీంతో ఏఆలోచన లేకుండా సాగుకు సమాయత్తమవుతున్నాం.

–జీతం వెంకయ్య, రైతు, వెల్లుర్తిపాడు

అప్పులు చేయాల్సిన పని లేదు



గతంలో రైతులు పెట్టుబడి కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి ఉండేది. నేడు ఆపరిస్థితి లేకుండా పోయింది. ఏడాదికి రూ.13,500 సాయం అందిస్తున్నారు. పంట నష్టపోతే నష్టపరిహారం కూడా వెంటనే అందిస్తున్నారు. మిర్చి నష్టపోతే ఎకరానికి రూ.47 వేల వరకు నష్టపరిహారం అందించారు. ఆసమయంలో నష్టపరిహారం లేకపోతే రైతులు చాలామంది అప్పులతో సతమతం అయ్యేవారు.

–చుంచు బెనర్జి, రైతు, పెనుగంచిప్రోలు

ప్రశాంత ఎన్నికల నిర్వహణే లక్ష్యం

ఏసీపీ డాక్టర్ రవికిరణ్



పెనుగంచిప్రోలు: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలన్నదే తమ లక్ష్యమని నందిగామ డివిజన్ ఏసీపీ డాక్టర్ రవికిరణ్ అన్నారు. గురువారం ఆయన సాక్షితో మాట్లాడారు. ఓటరు స్వేచ్ఛకు ఇబ్బంది లేకుండా పటిష్ట చర్యలు చేపట్టామన్నారు.

- గామ డివిజన్ పరిధిలో రెండు అర్బన్ (జగ్గయ్యపేట, నందిగామ) ప్రాంతాలు, నందిగామ, చందర్లపాడు, వీరులపాడు, కంచికచర్ల, పెనుగంచిప్రోలు, వత్సవాయి, జగ్గయ్యపేట మండలాలు ఉన్నాయి. వీటి పరిధిలో 12 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు ఉన్నాయి. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ చూసేందుకు ఎంపీడీఓల ఆధ్వర్యంలో బృందాలు పని చేస్తున్నాయి. రాష్ట్ర సరిహద్దుల్లో జొన్నలగడ్డ, పెద్దాపురం, వత్సవాయి, గండ్రాయి, ముక్త్యాల, గరికపాడు వద్ద చెక్‌పోస్ట్‌లు పని చేస్తున్నాయి. నిత్యం నగదు, మద్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తున్నాం.
- డివిజన్‌లో ఇప్పటికే ఒక కంపెనీ (80 మంది) సీఆర్‌పీఎఫ్ బలగాలు ఉన్నాయి. ప్రస్తుతం వారితో రెండు నియోజకవర్గాల్లో కవాతులు పూర్తి చేశాం. ఎన్నికల నాటికి వీరి సంఖ్య పెరుగుతుంది.

శాంతిభద్రతల పరిరక్షణకు..

- శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాం. డివిజనల్‌లో లైసెన్స్ కలిగిన 34 తుపాకులు డిపాజిట్ చేసుకోవటం జరిగింది. పాత నేరస్తులు, అల్లర్లకు పాలప్పడే వారిని ఇప్పటి వరకు 1575 మందిని గుర్తించి బైండోవర్ చేశాం. రౌడీషీటర్లకు ప్రత్యేక కౌన్సెలింగ్ ఇచ్చి, సమస్యాత్మక గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.
- డివిజన్ పరిధిలో ఉన్న తెలంగాణ సరిహద్దు ప్రాంతాల్లో ప్రత్యేకంగా 6 చెక్‌పోస్ట్‌లు ఏర్పాటు చేశాం. ఇప్పటికే నగదు రూ.2,76,73,330 సీజ్ చేయగా, మద్యం 5,870.665 లీటర్లు స్వాధీనం చేసుకుని, 29 వాహనాలు సీజ్ చేశాం.
- ఎన్నికల నియమావళిని ఉల్లంఘనపై ఫిర్యాదులకు ఎన్నికల కమిషన్ ప్రత్యేకంగా సీ-విజిల్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. డివిజన్‌లో ఏర్పాటు చేసిన ఫ్లయింగ్ స్క్వాడ్‌లు వీటిపై నిర్వతరం పర్యవేక్షిస్తాయి. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు పూర్తి చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టాం.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి..



వైఎస్సార్ సీపీలో చేరిన వారితో విప్ ఉదయభాను

షేర్‌మహ్మద్‌పేట(జగ్గయ్యపేట): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో చేసిన సంక్షేమాభివృద్ధి పథకాలను చూసి ప్రతిపక్ష టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరుతున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను పేర్కొన్నారు. గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు కూచిపూడి చిట్టిబాబు, షేక్ కరిముల్లా, డొక్కా బాబులు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలోకి ఉదయభాను సమక్షంలో గురువారం చేరగా వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ జరగనున్న ఎన్నికలలో పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. ఐదేళ్ల పాలనలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రతి గడపకు తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కమలేష్, సతీష్, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని చెరువుబజారుకు చెందిన తాళ్లూరి ఏడుకొండలు తెలుగుదేశం పార్టీని వీడి వైఎస్సార్ సీపీలోకి చేరారు. ఈ మేరకు గురువారం రాత్రి చెరువుబజారులో జరిగిన ఒక కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను, పార్టీ నియోజకవర్గ యువనేత సామినేని వెంకటకృష్ణ ప్రసాద్‌ల సమక్షంలో వైఎస్సార్ సీపీలోకి చేరాడు. ఆయనకు వారు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఇంటూరి చిన్నా, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన

ఇంటింటి ప్రచారంలో ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



ఇంటింటి ప్రచారంలో ఎమ్మెల్యే జగన్‌మోహనరావుకు హారతి ఇస్తున్న మహిళ

నందిగామ టౌన్: నియోజకవర్గ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగానే నా ఐదేళ్ల నందిగామ పాలన సాగిందని శాసనసభ్యుడు, నందిగామ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. పట్టణంలోని సీఎం రోడ్డు, రైతుపేట, గీతామందిరం రోడ్డు, వైఎస్సార్ విగ్రహం రోడ్డు, తదితర ప్రాంతాలలో గురువారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. రానున్న ఎన్నికలలో పూర్తి మద్దతు పలికి ఫ్యాను గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. ప్రజల వద్దకు వెళ్లిన ఎమ్మెల్యేకు ఆత్మీయ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో రానున్న కాలంలో నందిగామ పట్టణాన్ని మరింత అభివృద్ధి చేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. నందిగామ అభివృద్ధిని స్వాగతించాల్సిన టీడీపీ అడుగడుగునా అభివృద్ధి పనులను అడ్డుకుంటుందని ఆవేదన వ్యక్తం చేశారు.

మరోసారి అవకాశమిచ్చి అభివృద్ధిని నిరంతర ప్రక్రియగా మార్చాలని జగన్‌మోహనరావు కోరారు. వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ దొంతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, కౌన్సిల్ సభ్యురాలు బండారు గంగమ్మ, వార్డు కన్వీనర్‌లు బండారు వెంకట్రావ్, కోలేటి సుబ్బారావు, నాగరాణి, నాయకులు గుడివాడ సాంబశివరావు, మన్నెం దాసు, చిరుమామిళ్ల చైతన్యకుమార్, నెలకుదిటి శివనాగేశ్వరరావు, ఓర్సు జ్వాలా, బొంతు సతీష్‌రెడ్డి, షేక్ ఫాతిమ, మువ్వల శ్రీను, నల్లమల్లి మురళి, బండారు శేషు, కరుణాకర్, షరీఫ్, పొల్లా రాజా, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐరన్ మాత్రలు పంపిణీ

నందిగామ: మండలంలోని లింగాలపాడు జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు గురువారం ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సిబ్బంది ఐరన్ టాబ్లెట్లను పంపిణీ చేశారు. పాఠశాలలోని 215 మంది విద్యార్థులకు ఐరన్ టాబ్లెట్లు అందజేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాంబాబు తెలిపారు.

బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై సమీక్ష



కల్యాణ వేదిక ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఏసీపీ

తిరుమలగిరి(జగ్గయ్యపేట): స్థానిక వాల్మీకోద్భవ వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై నందిగామ ఏసీపీ రవికిరణ్ సమీక్షించారు. గురువారం ఆలయ ప్రాంగణంలో భద్రతా ఏర్పాట్లపై ఆలయ అధికారులు, గ్రామస్తులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 22 నుంచి 27 వరకు బ్రహ్మోత్సవాలు జరుగుతాయన్నారు. ఈ ఉత్సవాలకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు రానుండటంతో వారికి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ముఖ్యంగా 23న స్వామి వారి కల్యాణోత్సవానికి లక్ష మందికి పైగా భక్తులు వస్తారనే అంచనాతో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పార్టీ జెండాలు, లౌడ్ స్పీకర్‌లు, డీజేలు ఏర్పాటు చేయవద్దని సూచించారు. చలువ పందిళ్లు, తాగునీరు, ఘాట్ చుట్టూ మ్యాట్‌లు, తదితర వసతులు కల్పించాలని సూచించారు. అనంతరం కల్యాణ వేదిక ఏర్పాటు పనులను పరిశీలించారు. ఈవో సాంబశివరావు, ఎస్ఐ సతీష్, గ్రామ పెద్దలు తాటి రామారావు, వసంతరావు, రాంబాబు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

మొదలైన నామినేషన్ల ప్రక్రియ

తొలిరోజున ఐదు నామినేషన్లు దాఖలు

జగ్గయ్యపేట అర్బన్: మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా జగ్గయ్యపేట అసెంబ్లీ నియోజకవర్గానికి మొదటి రోజైన గురువారం ఐదు నామినేషన్లు దాఖలైనట్లు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి జి.వెంకటేశ్వర్లు తెలిపారు. ఉదయం 11.21 నిమిషాలకు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా శ్రీరాం రాజగోపాల్ తరఫున శ్రీరాం సుబ్బారావు మొదటి నామినేషన్ దాఖలు చేశారు. తెలుగుదేశం పార్టీ తరఫున శ్రీరాం శ్రీదేవి 12.23 నిమషాలకు రెండవ నామినేషన్ దాఖలు చేశారు. బహుజన సమాజ్ పార్టీ తరఫున ఎమ్మెల్యే అభ్యర్థిగా కొదమల ప్రభుదాసు మధ్యాహ్నం 1.25కు మూడవ నామినేషన్ దాఖలు చేశారు. నవరంగ్ కాంగ్రెస్ పార్టీ తరఫున చింతమల నవీన్ అంబేడ్కర్ 2.13 నిమిషాలకు నాల్గవ నామినేషన్ దాఖలు చేశారు. తెలుగు రాజ్యాధికార సమితి పార్టీ తరఫున గుడిసె రాంబాబు మధ్యాహ్నం 2.41 నిమిషాలకు ఐదవ నామినేషన్ పత్రాలను అందజేశారు. ఏఈఆర్‌వో, పేట తహసీల్దార్ జి.శేషగిరి, ఎలక్షన్ సిబ్బంది శ్రీనివాస కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నందిగామ నియోజకవర్గంలో మూడు నామినేషన్లు

నందిగామ: ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసిన వెంటనే ఆర్డీవో, నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఏ రవీంద్రరావు నామినేషన్ల స్వీకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మొదటిరోజు మూడు నామినేషన్లు స్వీకరించినట్లు రిటర్నింగ్ అధికారి తెలిపారు. తెలుగు రాజ్యాధికార సమితి పార్టీ తరఫున కంచికచర్లకు చెందిన బర్రె శ్రీనివాసరావు రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. నందిగామ మండలం కొణతమాత్మకూరు గ్రామానికి చెందిన కొత్తపల్లి సుందర్‌రావు స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నా 3 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం జరిగింది.

భారీ బందోబస్తు..

ఆర్డీవో కార్యాలయం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం ప్రారంభమైన నేపథ్యంలో ఆర్డీవో కార్యాలయ పరిసరాలలో పలు ఆంక్షలు విధించారు. ఆ ప్రాంతంలో 144వ సెక్షన్ అమలు చేయడంతో పాటు భారీగా పోలీసులను ఏర్పాటు చేశారు.

పరిపాలనా సౌలభ్యం కోసమే మార్పు

- ఎమ్మెల్సీ అరుణకుమార్
- వైఎస్సార్ సీపీలో చేరిన వీరులపాడు సర్పంచ్, టీడీపీ, కాంగ్రెస్ నాయకులు



ఖాజాకు పార్టీ కండువా కప్పి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్సీ అరుణకుమార్

వీరులపాడు: పరిపాలనా సౌలభ్యం.. ప్రజల అభ్యర్థన మేరకే మండల కేంద్రాన్ని మార్చటం జరిగిందని, రాజకీయ, స్వార్థ ప్రయోజనాలకు ఆస్కారం లేదని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ పేర్కొన్నారు. మండలంలోని జుజ్జూరు, వీరులపాడు, అల్లూరు గ్రామాలకు చెందిన కాంగ్రెస్, టీడీపీ క్రియాశీలక నాయకులు గురువారం రాత్రి ఆ పార్టీలను వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. వీరులపాడు సర్పంచ్ కన్నమాల సురేష్‌బాబుతో పాటు పార్టీలో చేరిన వారికి అరుణకుమార్ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా అరుణకుమార్ మాట్లాడుతూ ప్రజల అభ్యర్థన మేరకు చేపట్టిన మండల కేంద్ర మార్పును ప్రతిపక్ష పార్టీ అభ్యర్థి తంగిరాల సౌమ్య మద్దతు ఇస్తారో లేదో చెప్పాలన్నారు. వీరులపాడుకు వెళ్లి మండల కేంద్రం మార్పును వ్యతిరేకిస్తున్నామని మాట్లాడుతున్నారని జుజ్జూరు వైపు వచ్చినప్పుడు మండల కేంద్రానికి అనువుగా మాట్లాడుతున్నారని అసలు వారు మార్పుకు మద్దతు పలుకుతున్నారా లేక మార్చకుండా ఉండటానికి మద్దతు పలుకుతున్నారో చెప్పాలని ప్రశ్నించారు. టీడీపీని ప్రజలు నమ్మటం లేదు కాబట్టే వైఎస్సార్ సీపీలోకి వలసలు పెరుగుతున్నాయని తెలిపారు. అనంతరం జుజ్జూరు గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు షేక్ ఖాజా, నాగరాజు, మంజుల, రాఘవ, అల్లూరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి కామా కృష్ణలతో పాటు పార్టీలో చేరిన వారిని అరుణకుమార్ అభినందించారు. పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, మండల సచివాలయ కన్వీనర్ కోటేరు ముత్తారెడ్డి, కాపు, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్‌లు బొమ్మిశెట్టి భాస్కరరావు, షహనాజ్ బేగం, వైస్ ఎంపీపీ నాగుల్‌మీరా, నాయకులు పూలా రాంబాబు, శీలం లక్ష్మీప్రసన్న, రమావత్ కోటి, ఇప్పల కృష్ణారెడ్డి, పూలా పుల్లయ్య, పరిటాల నరసింహయ్య, లింగంశెట్టి పెద్ద బసవయ్య, జియాలుద్దీన్, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆత్మహత్యాయత్నం చేసిన మహిళ మృతి

తిరువూరు: భర్త మృతితో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యాయత్నం చేసిన తిరువూరుకు చెందిన బత్తుల రాములమ్మ (35) గురువారం మృతిచెందింది. తిరువూరు ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. తిరువూరు పట్టణానికి చెందిన రాములమ్మ భర్త కొన్ని రోజుల కిందట మరణించాడు. ఇద్దరు కుమారులను పోషించలేక, కుటుంబం గడవక ఈ నెల 11న రాములమ్మ పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. ఆమెను ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది.

ఉపాధి కూలీల ఆందోళన



ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ఉపాధికూలీలు

వత్సవాయి: మండల పరిషత్ కార్యాలయం ఎదుట కన్నెవీడు గ్రామానికి చెందిన ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న కూలీలు గురువారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి హామీలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ తమను ఇబ్బందులకు గురిచేస్తుందని ఆరోపించారు. కూలీలతో చేయించాల్సిన పనులను జేసీబీతో చేపిస్తున్నారని తెలిపారు. పనికిరాని వారికి సైతం వారు పనికి వచ్చినట్లు హాజరు వేస్తోందన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ చెప్పినట్లు వింటేనే పని ఉంటుందని లేకపోతే మీకు పనిలేదని వెళ్లగొడుతుందని వాపోయారు. అంతేకాకుండా వారం రోజులు పనిచేస్తే మూడు, నాలుగు రోజులు మాత్రమే హాజరు వేస్తున్నట్లు గుర్తించి అడిగితే నా ఇష్టం అని సమాధానం చెబుతున్నారని ఆరోపించారు. ఎంపీడీవో భరత్‌రాజ్‌కు వినతిపత్రాన్ని అందించారు. దీనిపై స్పందించిన ఆయన వెంటనే ఎఫ్ఏకు ఫోన్ చేసి వివరాలు అడిగారు. విచారణలో తేలినట్లయితే వెంటనే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఆందోళనకారులకు చెప్పారు.

ముగ్గురి అరెస్ట్

తిరువూరు: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు తిరువూరు సర్కిల్ పరిధిలో గురువారం దాడులు నిర్వహించారు. గంపలగూడెం మండలం అమ్మిరెడ్డిగూడెంలో సారా విక్రయిస్తున్న చప్పిడి కృష్ణకుమారి నుంచి ఐదు లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. నెమలిలో 15 తెలంగాణ మద్యం సీసాలతో యాదాల జయరాజ్ పట్టుబడ్డాడు. ఎ.కొండూరు మండలం గొల్లమందల తండాలో దారావత్ బద్దు నుంచి 10 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని అదుపులోకి తీసుకున్నారు. నిందితులను తిరువూరు కోర్టులో హాజరుపరిచామని ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ అశోక్ తెలిపారు.

నిర్లక్ష్యమే అగ్ని ప్రమాదాలకు కారణం

ఫైర్ అధికారి శ్రీనివాసరావు



ఆల్ఫా హోటల్‌లో అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ అధికారి శ్రీనివాసరావు

కంచికచర్ల: చిన్నపాటి నిర్లక్ష్యం కారణంగా అగ్ని ప్రమాదాలు జరుగుతున్నాయని ఫైర్ అధికారి తలశిల శ్రీనివాసరావు పేర్కొన్నారు. అగ్ని మాపక వారోత్సవాల సందర్భంగా స్థానిక ఆల్ఫా హోటల్, పెట్రోలు బంక్‌లలో అగ్నిప్రమాదాలపై గురువారం వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ అగ్నితో మంటలు చెలరేగటం, విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఆస్తి, ప్రాణ నష్టం జరుగుతుంటాయన్నారు. గ్యాస్ వెలిగించే సమయంలో కిటికీలు తెరిచి ఉంచాలన్నారు. ముఖ్యంగా అగ్ని ప్రమాదాలు జరిగే దగ్గరలో నీటి సదుపాయం అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. భవనం పై అంతస్తులో ప్రమాదాలు జరిగినప్పుడు తాళ్ల సాయంతో కిందకి రావాలన్నారు. చిన్న పిల్లలను నిప్పుకు దూరంగా ఉంచాలన్నారు. అనంతరం మాక్ డ్రిల్ నిర్వహించారు. కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది బీ శ్రీను, ఎస్‌కే తాజుద్దీన్, బీ సంజీవ్ వర్మ, షేక్ సుభానీ, శ్రీనివాసరావు, జీ రాజశేఖర్, బీ జీవన్, ఎం.అశోక్ పాల్గొన్నారు.

1,190 మద్యం సీసాలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు చూపుతున్న అధికారులు

వత్సవాయి: తెలంగాణ నుంచి అక్రమంగా తీసుకువచ్చి దాచిపెట్టిన 1,190 మద్యం సీసాలను విజయవాడ ఇంటిలిజెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి రామశివ పర్యవేక్షణలో జగ్గయ్యపేట సెబ్ సీఐ మణికంఠరెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది దాడిచేసి పట్టుకున్నారు. వత్సవాయి గ్రామానికి చెందిన ఐదుగురు బెల్ట్ షాపు నిర్వాహకులు తెలంగాణ నుంచి 1,190 మద్యం సీసాలను అక్రమంగా తీసుకువచ్చారు. వాటిని గ్రామ శివారులో డంపింగ్ యార్డు వద్ద వరిగడ్డి వాములో దాచిపెట్టారు. విషయం తెలుసుకున్న అధికారులు దాడులు చేసి మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఐదుగురుపై కేసులు నమోదు చేశారు. ఎన్నికల సందర్భంగా ముందస్తుగా మద్యాన్ని దాచిపెట్టినట్లు అదుపులోనికి తీసుకున్న వ్యక్తులు తెలిపారు.